అస్తవ్యస్తం ఊళ్లపాలెం సముద్రతీరం



ఊళ్లపాలెం తీరంలో నిర్మించిన సిమెంటు రోడ్డు

- కోతకు గురైన ఊళ్లపాలెం సముద్రతీరం
- అలల ఉధృతి సమయంలో తీరంలో నిలుస్తున్న సముద్రం నీరు
- బోట్లు, వలలు ఎలా భద్రపరుచుకోవాలంటూ ఆందోళన
- ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు

సింగరాయకొండ: అలల తాకిడికి ఊళ్లపాలెం సముద్రతీరం అస్తవ్యస్తంగా మారింది. అలల ఉధృతితో తీరంలో సముద్రం నీరు నిలవడంతో మత్స్యకారులు వలలు, బోట్లు ఎలా భద్రపరచుకోవాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు. తీరంలో ఇటీవల సుమారు రూ.25 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు అడ్డంకిగా మారిందని, ఈ రోడ్డు వల్ల వలలు, బోట్లు దూరంగా ఏర్పాటు చేసుకోవాలంటే ఇబ్బందిగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రపు అలల తాకిడికి ఇటీవల తీరంలో ఉన్న రొయ్యల చెరువుల కట్టలు సైతం ధ్వంసం అయ్యాయని మత్స్యకారులు తెలియజేస్తున్నారు.

ఎలా భద్రపరుచుకోవాలి..?

ఊళ్లపాలెం సముద్రతీరంలో మూడు నెలలుగా సుమారు 50 మీటర్ల తీరం కోతకు గురై సముద్రం ముందుకు వచ్చింది. ఈ క్రమంలో తీరం సుమారు 3 అడుగుల ఎత్తు కోతకు గురైంది. క్రమేణా సముద్రం మళ్లీ సుమారు 40 మీటర్ల దూరం వెనక్కి జరిగిందే తప్ప కోతకు గురైన మూడు అడుగుల ఎత్తు మాత్రం అలానే ఉంది. దీనికి తోడు తీరంలో ఒడ్డు ఎత్తుగా ఉండటం, తరువాత తీరం తక్కువగా ఉండటంతో ఏమాత్రం అలల ఉధృతి ఎక్కువగా ఉన్నా దిగువగా ఉన్న తీరంలో నీరు నిలుస్తోందని, దీంతో వలలు, బోట్లు ఎలా భద్రపరచుకోవాలో అర్థం కావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు

సముద్రతీరంలో అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు రూ.25 లక్షలతో పల్లెపండుగ నిధులతో తీరానికి సమాంతరంగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. దీంతో రోడ్డు గుండా తీరంలోకి వెళ్లడానికి అవకాశం ఉండేది. అంతేకాక పర్యాటకుల రద్దీ పెరగుతుందని అందరూ ఆశించారు. కానీ తీరంలో రోడ్డు నిర్మాణం పూర్తయిన నాటి నుంచి సముద్రం సుమారు మూడు అడుగుల మేర ఎత్తు కోతకు గురవటం సుమారు 60 మీటర్లు ముందుకు రావటంతో తీరం సిమెంటు రోడ్డు తాకింది. ఈ రోడ్డు నిర్మాణ సమయంలో తీరానికి 100 మీటర్ల దూరంలో సమాంతరంగా రోడ్డు నిర్మించాలని సూచించామని, అయితే అప్పటి ఇంజినీరింగ్ అధికారులు మామాట పట్టించుకోకుండా రోడ్డును మొదట నిర్ణయించిన చోట కాకుండా ముందుకు జరిపి నిర్మించారని, దీంతో ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు.

అంతేకాక తీరం మూడు అడుగుల ఎత్తు కోతకు గురవటంతో సిమెంటు రోడ్డు నుంచి తీరం వద్దకు వెళ్లటానికి వీలు పరిస్థితి ఉంది. తుఫాన్ల సమయంలో వలలను తీరానికి దూరంగా జరుపుకోవాలంటే చాలా ఇబ్బందులు తప్పవని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రెండు రోజుల పాటు తీరంలో వాతావరణ ప్రభావంతో అలల ఉధృతి కారణంగా తీరంలో నీరు నిలబడిందని, దీంతో ఇబ్బందులు పడ్డామని మత్స్యకారులు తెలియజేస్తున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం తీరంలో నిర్మించిన రొయ్యల చెరువుల కట్టలు తెగిపోయాయని, దీంతో రొయ్యల సాగు చేయటానికి అవకాశం లేదని రైతులు తెలియజేస్తున్నారు. తీరంలో మత్స్యకారుల ఇబ్బందులు తీర్చేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపి తమ ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం: మూడు నెలలుగా ఊళ్లపాలెం తీరం కోతకు గురైంది. సుమారు 60 మీటర్లు ముందుకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ 50 మీటర్లు వెనక్కి వెళ్లింది. ఒడ్డున ఎత్తుగా ఉండటం తరువాత పల్లంగా ఉండటంతో ఏమాత్రం అలలు ఉధృతంగా ఉన్నా పల్లంగా ఉన్న చోట నీరు నిలుస్తోంది. దీంతో వలలు, బోట్లు భద్రపరచుకోవాలంటేనే ఇబ్బందులు పడుతున్నాం.
– సైకం వినోద్, మత్స్యకారుడు, ఊళ్లపాలెం

వలలు, బోట్లు భద్రపరుచుకోవాలంటే ఇబ్బంది: మూడు నెలలుగా తీరం కోతకు గురైంది. దీనికి తోడు తీరంలో సిమెంటు రోడ్డు నిర్మించారు. తీరం కోతకు గురవటంతో పాటు సుమారు మూడు అడుగుల ఎత్తు కోతకు గురవటంతో వలలు, బోట్లు భద్రపరచుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం.
–గొల్లపోతు వెంకయ్య, మత్యకారుడు, ఊళ్లపాలెం



ఊళ్లపాలెం తీరంలో అలల ఉధృతి సమయంలో పల్లపు ప్రాంతంలో నిలిచిన నీరు



అలల ఉధృతంగా లేనప్పుడు పరిస్థితి



ఊళ్లపాలెం తీరంలో కోతకు గురైన రొయ్యల చెరువు కట్టలు

దద్దాలకు ఆహ్వానం

కనిగిరిరూరల్: వచ్చే నెల 2 తేదీ నుంచి 9 వరకు జరిగే సాయి సప్తహ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ స్థానిక సాయిబాబా దేవస్థాన కమిటీ నాయకులు ఆదివారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌కు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆలయ కమిటీ నాయకులు పార్టీ కార్యాలయానికి వచ్చి ఆహ్వాన పత్రికను అందచేశారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, ముచ్చర్ల ధర్మారావు, టి.వెంకటేశ్వర్లు, వెంగళరావు గుప్తా, రాచర్ల నరేష్, తాళ్లూరి రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

కందుకూరు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమాజా సేవా కార్యక్రమాలు భవిష్యత్‌లోను నిరంతరాయంగా కొనసాగుతాయని వాసవియన్, డైమండ్ స్టార్ హనుమానొట్టి సీతారామయ్య అన్నారు. వాసవీ క్లబ్ లెజెండ్స్, వనతి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా పెద్దబజార్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోశాలలో గరుకు స్తంభం ఏర్పాటు చేశారు. పాఠశాలలో పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. అలాగే దివ్యాంగుల పాఠశాలకు మంచం, పరుపు, సిమెంట్ బల్లలు అందజేశారు. టీఆర్ఆర్ కాలేజీలో మొక్కలు నాటి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. పేదలకు నిత్యావసర సరులకు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ నాయకులు తుమ్మన పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చర్చి అభివృద్ధి పేరిట అక్రమ వసూళ్లు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ది సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎస్ఐబీ) అభివృద్ధి పేరిట సంబంధంలేని వారు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని చర్చి సెక్రటరీ ప్రసంగి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చి అభివృద్ధి పేరిట కొందరు వ్యక్తుల వద్దకు వెళ్లి చందాలు వసూలు చేస్తూ చర్చి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. చర్చికి సంబంధంలేని వారు చెప్పే మాటలు నమ్మి విశ్వాసులు మోసపోవద్దని సూచించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

గిద్దలూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయానికి వాటర్ డిస్పెన్సర్ అందజేత

మార్కాపురం: మార్కాపురం శాఖాగ్రంథాలయానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ రామకృష్ణారావు ఆదివారం వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శివారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రంగయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గిద్దలూరు రూరల్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని స్పందన సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి పిక్కిలి పుల్లయ్య పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల పిక్కిలి పుల్లయ్య కాంప్లెక్స్ వద్ద యోగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటుగా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. యోగాసనాలను ఏ విధంగా వేయాలి, ఉపయోగాల గురించి పుస్తకాల్లో వివరించినట్లు పేర్కొన్నారు. యోగాసనాలను నిత్య జీవనంలో అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల!



గొట్లగట్టులో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయి. మరి కొన్ని గ్రామాలలో రాత్రి పూట కూడా వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొట్లగట్టు, సిద్ధవరం ఎస్సీ కాలనీ, పేరారెడ్డిపల్లి, కాట్రగుంట, వెంగలపల్లి తదిర గ్రామాల్లో పగటి పూట వీధి లైట్లు వెలుగుతున్నా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు.

పలు చోట్ల అంధకారం

రాత్రిపూట వీధిలైట్లు లేక, పలు చోట్ల వెలగక ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. నాయుడుపేటలో, ఎదురాళ్లపాడు ఎస్సీ కాలనీలో కొన్ని లైట్లు ఉన్న వెలగడం లేదు. కొన్ని చోట్ల స్తంబాలకు లైట్లే వేయకపోవడంతో రాత్రి పూట చీకట్లో భయభయంగా వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయడంతోపాటు పగటి పూట కాకుండా రాత్రి వేళ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'మా ఇంటికి తాళాలు వేశారు'

సింగరాయకొండ: 'మా ఇంటికి ఫైనాన్స్ కంపెనీ వారు తాళాలు వేశారు మాకు న్యాయం చేయాలంటూ బింగినపల్లి ఎస్టీ కాలనీకి చెందిన పోట్లూరి వెంకటేశ్వర్లు దంపతులు వాపోయారు. వివరాల్లోకి వెళితే..ఎస్టీ కాలనీవాసుల సమాచారం ప్రకారం వెంకటేశ్వర్లు కుటుంబం ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో అప్పుగా తీసుకున్నారు. ఆదివారం ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వెంకటేశ్వర్లు ఇంటికి తాళాలు వేయడంతో గొడవ జరిగిందన్న సమాచారం అధికార పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అయితే ఆ ఇంటికి గత 20 రోజులుగా తాళాలు వేసి ఉన్నాయని, కానీ అధికార పార్టీ నేతలు ఆదివారం వేసినట్లు ప్రచారం చేశారు. దీనిపై ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు మాత్రం వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు ఇల్లు మార్టిగేజ్ తీసుకుని అప్పు తీసుకున్నారని, నాలుగు నెలలుగా వాయిదాలు చెల్లించటం లేదని, మేం ఎప్పుడు వెళ్లినా ఇంటికి తాళం వేసే ఉంటుందని చెప్పడం గమనార్హం.

యువత పోరును జయప్రదం చేయండి

కందుకూరు: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడం లేదని, దీని వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కల్లబొల్లి మాటలతో ఏడాది కాలాన్ని గడిపేశారని, యువతను దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లు ఇవ్వడం లేదని, దీని వల్ల విద్యార్థులు పరీక్షలకు దూరమవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఈనెల 23న జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్‌రేట్‌ల వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొండపి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ సారథ్యంలో మండలంలోని నేతలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

టంగుటూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో సోమవారం జరిగే యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేసిన వైనాన్ని ప్రజలకు తెలియచెప్పేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.


వెంకటలక్ష్మి భౌతికకాయానికి దద్దాల నివాళి



లక్ష్మి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ, కస్తూరిరెడ్డి

కనిగిరిరూరల్: మాచవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొత్తూరుకు చెందిన పోలక వెంకటలక్ష్మి భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ప్రమాద ఘటన వివరాలు తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మండతల కస్తూరిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఈర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగా భవానీ నెల పొంగళ్లు



విశిష్ట అలంకరణలో గంగా భవానీ ఉత్సవమూర్తులు



ఆలయం వద్ద పొంగళ్లతో భక్తులు

సీఎస్‌పురం(పామూరు): స్థానిక గంగాభవానీ ఆలయంలో అమ్మవారి నెల పొంగళ్లు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు గంగామాత మూల విగ్రహ మూర్తికి, ఉత్సవ మూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులు పొంగళ్లతో ఆలయ ప్రదక్షిణ చేసి పొంగళ్లను నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

చలో తెనాలి విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

కందుకూరు: దళిత యువకులపై పోలీసులు ప్రదర్శించి దాష్టీకాన్ని నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 28న చేపట్టిన చలో తెనాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు దళిత సంఘాల నాయకులు కోరారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద చలో తెనాలి కార్యక్రమ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ మాట్లాడుతూ దళిత యువకులపై దాడి చేసిన రాములు నాయక్, రమేష్‌బాబులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రౌడీల పేరుతో పోలీస్ అధికారులు కిరాతకంగా దళిత యువకులపై దాడి చేశారన్నారు. పోలీస్ దాష్టీకానికి, హోంమంత్రి అనిత వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 28న చేపట్టిన చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. మాల మహానాడు రాష్ట్ర జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు, కందుకూరు డివిజన్ మాల ఉద్యోగుల సంఘం, మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు లింగాబత్తిన బ్రహ్మయ్య, దారా అంజయ్య, కట్టా రమేష్, దమ్ము థామస్, పర్రె శ్రీనివాసులు, రిటైర్డ్ డీఈఈ చెక్కా శింగయ్య, పంది కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: తెనాలిలో దళిత యువకులపై పోలీసుల దాడిని నిరసిస్తూ ఈనెల 28న చేపట్టిన చలో తెనాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ దళితి సంఘాల నాయకులు ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద చలో తెనాలి కరపత్రాలను విడుదల చేశారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, చదలవాడ బాలగురవయ్య, దారా అంజయ్య, రావినూతల కోటయ్య, కోటపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, అభిషేకం



మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, అనంతరం స్వామికి అభిషేక కార్యక్రమం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ పంచామృతాలతో స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, గుర్రం వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.



గోపూజ చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పచ్చిరొట్ట విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

పొన్నలూరు: మండలంలోని రైతులు పచ్చిరొట్ట విత్తనాలు కోసం రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ రాము తెలిపారు. ప్రస్తుతం జనుములు 80 క్వింటాళ్ల వరకు అందుబాటులో ఉన్నాయని, 50 శాతం రాయితీతో కేజీ రూ.54 చొప్పున అందజేస్తామన్నారు. ఎకరానికి 10 కేజీలు చొప్పున ఐదెకరాల వరకు విత్తనాలు అందజేస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ ఆలయంలో విశిష్ట పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలోని బొట్ల గూడూరు పంచాయతీ పరిధిలోని కమ్మవారి పాలెం, రఘునాథపురం సమీపంలోని అచ్చమాంబ పేరంటాలు ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తిరునాళ్ల సందర్భంగా వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు కొల్లూరి వెంకట రవికిరణ్ శర్మ, సాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉపవాసాలతో పొంగళ్లు పొంగించి ఉత్సవంగా ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లను పురస్కరించుకుని 5 రోజులపాటు ఉత్సవమూర్తికి కమ్మవారిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో మేళతాళాలు, కనకపుతప్పెట్లు, బాణసంచా కాల్చుతూ గ్రామోత్సవం కన్నులపండుగగా సాగింది. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు. పూజల్లో కోటపాటి జనార్దన్, యారవ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.